సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 23 । జూన్ । 2023



చీడపీడల నివారణపై..

చీడపీడల నివారణపై అవగాహన ఉండాలని జాతీయ మొక్కల ఆరోగ్య నిర్వహణ సంస్థ ఏడీ మరియాదాస్ అన్నారు.

- 10లో



వైభవంగా సుదర్శన హోమం

దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని యాదాద్రి ఆలయంలో సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు.

- 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33° / 26°

పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉరుములతో కూడిన వర్షం వచ్చే అవకాశం ఉంటుంది.

న్యూస్‌రీల్

మోదీ పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు



ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

దురాజ్‌పల్లి : ప్రధాని నరేంద్ర మోదీ 9 ఏళ్ల పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ద్వారా 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి కిసాన్ యోజన ద్వారా 12 కోట్ల మంది రైతులకు ఏడాదికి రూ.6000 ఇస్తున్నట్లు చెప్పారు. బీజేపీ జిల్లా కోశాధికారి పగిళ్ల సుసింధర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న న్యాయవాదులు

చివ్వెంల : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలేబోయిన నర్సయ్య యాదవ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

26న డీవీ కృష్ణ వర్ధంతి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : ఈ నెల 26న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణ ప్రథమ వర్ధంతి నిర్వహిస్తున్నట్లు ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక తెలిపారు. గురువారం స్థానిక విక్రమ్ భవన్‌లో వర్ధంతిసభ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. నీతి, నిజాయితీ, నిబద్ధతతో తన జీవితాంతం విప్లవోద్యమం కోసం అవిశ్రాంతంగా కృషిచేసిన ప్రజా నాయకుడు డీవీ కృష్ణ అని ఆమె అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం కోసం ప్రథమ వర్ధంతి సభలో విప్లవ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా రాంజీ, పార్టీ పట్టణ నాయకులు జీవన్, రమేష్, వాజిద్, శైలజ, పద్మ, షాహిన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం



మాట్లాడుతున్న రాపోలు నవీన్ కుమార్

నేరేడుచర్ల : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్ ఆరోపించారు. గురువారం నేరేడుచర్లలో నిర్వహించిన బీఎస్పీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరవీరుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల ఆర్థికసాయం అందించి, ప్రతి ఇంటికీ ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలన్నారు. అమరవీరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో వారి ఆత్మలు ఘోషించే విధంగా బీఆర్‌ఎస్ పాలన ఉందన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు జిలకర రామస్వామి, నాగార్జున, వెంకటేశ్వర్లు, సతీష్‌రెడ్డి, గోవర్దన్, సత్యం, భిక్షం, ప్రేమ్‌కుమార్, హుస్సేన్, సుధీర్, సతీష్ తదితరులున్నారు.

తొలకరి పలకరించె..!



గరిడేపల్లి మండల కేంద్రంలోని కల్మలచెరువు రోడ్డులో నిలిచిన వర్షపు నీరు



నేరేడుచర్లలో కురుస్తున్న వర్షం

- నైరుతి రుతుపవనాల రాక
- నేరేడుచర్లలో భారీగా.. చాలా చోట్ల మోస్తరు వర్షం
- ఊపందుకోనున్న వ్యవసాయ పనులు
- రైతుల్లో ఆనందం

సూర్యాపేట : తొలకరి పలకరించింది. నైరుతి రుతుపవనాల ఆగమనంతో గురువారం జిల్లాలోని నాలుగైదు మండలాలు మినహా అంతటా మోస్తరు వర్షం కురిసింది. నేరేడుచర్లలో భారీ వర్షం పడింది. మూడు నెలలుగా వేసవిలో పెరిగిన ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి అయిన జనం ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ఊపిరిపీల్చుకున్నారు. జిల్లా వ్యాప్తంగా సాగు పనులు ముమ్మరం కానుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగైదు మండలాలు మినహా...

ఈనెల మొదటి రెండు వారాల్లో రావాల్సిన రుతుపవనాలు కొంత ఆలస్యంగా రాష్ట్రాన్ని తాకాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో వర్షాలు ప్రారంభమయ్యాయి. మఠంపల్లి, మునగాల, అనంతగిరి, చిలుకూరు మండలాల్లో వరుణుడు కరుణించలేదు. ఇక నేరేడుచర్లలో భారీ వర్షం పడింది. నడిగూడెం, పెన్‌పహాడ్, చివ్వెంల, ఆత్మకూర్ (ఎస్), హుజూర్‌నగర్, అర్వపల్లి, గరిడేపల్లి మండలాల్లో మోస్తరుగా వర్షం కురిసింది. మితగా చోట్ల చిరుజల్లులు పడ్డాయి. ఇక రుతుపవనాలకు ముందస్తుగా బుధవారం రాత్రి 8.30గంటల నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లాలోని పలు మండలాల్లో వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తిరుమలగిరిలో 23.6 మిల్లీ మీటర్లు, చివ్వెంల 14.7, నూతనకల్ 10.0, గరిడేపల్లిలో 7.4, పెన్‌పహాడ్‌లో 7.1 మి.మీ చొప్పున వర్షం పడింది.

సాగుకు సిద్ధంగా దుక్కులు..!

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే కురిసిన చిన్నపాటి జల్లులకు రైతాంగం దుక్కులు దున్నుకున్నారు. తొలకరి వర్షాలకు పత్తి విత్తనాలు విత్తుకోవడానికి దుక్కులను సిద్ధం చేసుకున్నారు. నందిగామ, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, తొర్రూరు తదితర ప్రాంతాలకు వెళ్లి పత్తి విత్తనాలను సైతం తెచ్చుకున్నారు. కొన్నిచోట్ల వారం, పది రోజులుగా వట్టిదుక్కిలోనే అచ్చులు తోలుకొని పత్తి విత్తనాలను విత్తుతున్నారు. ఇతర మెట్ట పంటలైన పెసర, వేరుశనగ విత్తనాలను అక్కడక్కడా రైతులు వేశారు. ఈ పంటలకు పెద్దగా వర్షాలు అవసరం లేకపోవడంతో రోహిణి కార్తె చివర్లో విత్తనాలను విత్తుకున్నారు. ఇక నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో వరి సాగు కోసం నారుమడులను సిద్ధం చేసుకోవడం, నారు చల్లుకునే పనిలో రైతులు ఉన్నారు. వర్షాలు విస్తారంగా కురిస్తే మిగతా పొలాలన్నీ కలియ దున్ని నాట్లు వేయాలని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు ఈ క్రమంలోనే రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. మరో రెండు మూడు రోజుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు రెట్టింపు ఉత్సాహంతో వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ రెండు మూడు రోజుల్లో మంచి అదునుగా వర్షాలు పడితే ఓవైపు పత్తి... మరోవైపు వరి సాగు పనులు జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా సాగే అవకాశం ఉంది.

సాగు అంచనా 6.32 లక్షలు..

ఈ వానాకాలం జిల్లాలో 6.32 లక్షల ఎకరాల్లో పంటల సాగు జరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ భావించింది. రుతుపవనాలు ఆలస్యం కాకపోతే ఇప్పటికే మెట్ట పంటల సాగు ముమ్మరంగా జరిగేది. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా పది నుంచి 15 రోజులు ఆలస్యంగా రుతుపవనాలు రావడం, తొలకరి వర్షాలు లేకపోవడంతో సాగు పనులు మందగించాయి. మెట్ట పంటలే కాకుండా వరి సాగు కోసం నార్లు పోసేందుకు కూడా రైతులు కాస్త వెనకడుగు వేశారు. ఈ నేపథ్యంలో గురువారం కురిసిన తొలకరి జల్లులతో ఇక వ్యవసాయ పనులు ఊపందుకోనున్నాయి.

దరఖాస్తులు 23,374

- జీసీ కులవృత్తి దారుల రూ.లక్ష సాయానికి అత్యధికంగా సూర్యాపేట మున్సిపాలిటీలో 1,653 దరఖాస్తులు
- ముగిసిన గడువు.. మొరాయించిన సర్వర్
- ధ్రువీకరణ పత్రాల జారీలోనూ జాప్యం
- పూర్తిస్థాయిలో దరఖాస్తు చేసుకోలేని జనం



ఆత్మకూర్‌లో మీసేవ కేంద్రం వద్ద బారులుదీరిన దరఖాస్తుదారులు(ఫైల్)

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : బీసీ కుల వృత్తిదారులకు సర్కారు అందించనున్న రూ.లక్ష ఆర్థిక సాయం కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. మంగళవారంతో గడువు ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 23,374 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆదాయ, కులధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం.. సర్వర్ మొరాయించడం తదితర కారణాలతో చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోయారు.

మొదటి నుంచీ ఆటంకమే

కుల వృత్తిదారులకు ప్రోత్సాహం అందించేందుకు బీసీ సంక్షేమ శాఖ ద్వారా రూ. లక్ష ఆర్థిక సాయం అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. దీనికోసం ఈనెల 6 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తుల సమర్పణకు ప్రజలు ఆది నుంచీ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ తొలిరోజు నుంచి 8వ తేదీ వరకు వెబ్ సైట్ సక్రమంగా పనిచేయలేదు. ఆర్థిక సాయం మంజూరు కోసం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉండగా ప్రజలు మీ సేవ కేంద్రాలకు వందల సంఖ్యలో తరలివచ్చారు. ఫలితంగా ధ్రువీకరణ పత్రాల సర్వర్ సైతం మొరాయించింది. చివరి రోజు రెండు సైట్లు బాగానే పని చేసినప్పటికీ జిల్లాలోని మీ సేవ కేంద్రాల వద్ద ప్రజలు భారీ ఎత్తున ఉండటంతో రూ.లక్ష ఆర్థిక సహాయం పొందేందుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాల్సి ఉండటంతో పలువురు దళారులను ఆశ్రయించారు. ఒక్కో దరఖాస్తుకు రూ.500 నుంచి రూ.వేయి వరకు వసూలు చేశారు. అయినప్పటికీ సైట్లు పనిచేయకపోవడంతో సర్టిఫికెట్లను సకాలంలో అందించలేక పోయారు. దీంతో పలువురు ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోలేకపోయారు.

అత్యల్పంగా నేరేడుచర్ల మున్సిపాలిటీలో 340 దరఖాస్తులు

రూ.లక్ష ఆర్థిక సాయం కోసం జిల్లావ్యాప్తంగా 23,374 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా సూర్యాపేట మున్సిపాలిటీలో 1,653, కోదాడ మున్సిపాలిటీలో 1,504, దరఖాస్తులు వచ్చాయి. గరిడేపల్లి మండంలో 1,440 దరఖాస్తులు అందాయి. ఇక అత్యల్పంగా నేరేడుచర్ల మున్సిపాలిటీలో 340 , తిరుమలగిరి మండలంలో 383 దరఖాస్తులు వచ్చాయి.

విధివిధానాలు వచ్చాయి

బీసీలోని 15 కులాలలకు రూ. లక్ష ఆర్థిక సాయం అందించడానికి ప్రభుత్వం విధివిధానాలను విడుదల చేసింది. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్‌లు అర్హులను ఎంపిక చేస్తారు. అర్హులకు ప్రతి నెల 15 తేదీల రుణాలు అందనున్నాయి.

– ఎస్తేరు, జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి

దశాబ్ది ఉత్సవాలు విజయవంతం

దురాజ్‌పల్లి(సూర్యాపేట): జిల్లాలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు విజయవంతంగా ముగిసినట్లు అధికార యంత్రాంగం తెలిపింది. ఈ నెల 2న ప్రారంభమై గురువారం వరకు 21 రోజుల పాటు నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో జిల్లా వ్యాప్తంగా 8,78,981 మంది పాల్గొన్నారు. వీరిలో రైతులు, ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు. మొదటి రోజు తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 6,850 మంది పాల్గొన్నారు. రెండో రోజు రైతు దినోత్సవంలో 97,240 మంది, మూడవ రోజు సురక్ష దినోత్సవంలో 10,700 మంది , నాలుగో రోజు విద్యుత్ దినోత్సవంలో 5,760 మంది, 5వ రోజు పరిశ్రమల దినోత్సవంలో 900 మంది పాల్గొన్నారు. 6వ రోజు సాగునీటి దినోత్సవంలో 1,19,957 మంది , 7వ రోజు ఊరూరా చెరువుల పండుగలో 1,31,872 మంది, 8వ రోజు సంక్షేమ దినోత్సవంలో 10,600 మంది, 9వ రోజు సుపరిపాలన దినోత్సవంలో 11,758 మంది, 10వ రోజు సాహిత్య దినోత్సవంలో 450 మంది పాల్గొన్నారు. 11వ రోజు తెలంగాణ రన్‌లో 7,100 మంది, 12వ రోజు మహిళా దినోత్సవంలో 12,000 మంది, 13వ రోజు ఆరోగ్య దినోత్సవంలో 9,650 మంది, 14వ రోజు ప్రగతి దినోత్సవంలో 9,650 మంది పాల్గొన్నారు. 15వ రోజు పట్టణ ప్రగతిలో 11,540 మంది, 16వ రోజు గిరిజన దినోత్సవంలో 30,680 మంది, 17వ రోజు మంచినీళ్ల పండుగలో 1,12,400 మంది, 18వ రోజు హరితోత్సవంలో 71,640 మంది, 19వ రోజు విద్యా దినోత్సవంలో 18,928 మంది, 20వ రోజు ఆధ్యాత్మిక దినోత్సవంలో 10,705 మంది, 21 వ రోజున అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో 1,10,600 మంది పాల్గొన్నారు. దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కలెక్టర్ వెంకట్రావు కృతజ్ఞతలు తెలియజేశారు.

అమరుల త్యాగం అజరామరం



అమరుల దినోత్సవం సందర్భంగా సూర్యాపేటలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు



బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్న మంత్రి జగదీష్‌రెడ్డి

- త్యాగాల పునాదుల మీదనే రాష్ట్ర సాధన
- దశాబ్దిఉత్సవాల్లో అధికారుల పాత్ర ప్రశంసనీయం
- అమరవీరుల దినోత్సవంలో మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : రాష్ట్ర సాధనలో అమరుల త్యాగం అజరామరమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి కొనియాడారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో అమర వీరులో దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల నుంచి సద్దుల చెరువు (మినీ ట్యాంక్ బండ్)వద్ద ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించిన ర్యాలీ మంత్రి స్వయంగా బైక్ నడిపారు. అక్కడ అమరవీరులకు నివాళులర్పించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన తర్వాత రెండు నిమిషాలు మౌనం పాటించారు. అమరవీరుల కుటుంబాలను ఘనంగా సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో అమరుల పాత్ర చిరస్మరణీయంగా నిలిచిపోతుందన్నారు. వారి స్ఫూర్తి వర్తమానానికి అందించాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పమని పేర్కొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అమర వీరుల కుటుంబాలకు సీఎం కేసీఆర్ అండ దండలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అమరవీరులను స్మరించుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వం అమరవీరుల దినోత్సవం ఏర్పాటు చేసిందన్నారు. త్యాగాల పునాదుల మీదనే రాష్ట్ర సాధన సాధ్యమైందన్నారు. అమర వీరుల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. బీళ్లుగా మారిన పంటపొలాలకు సమృద్ధిగా సాగునీరు, ఇంటింటికీ మంచినీరు, 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాలో తెలంగాణ రాష్ట్రంతో మరెవరూ పోటీ పడలేని విధంగా మార్పు తీసుకొచ్చామన్నారు. ప్రజలు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రభుత్వం భాగస్వామ్యంతో జరుపుకున్న దశాబ్దిఉత్సవాలు చరిత్రలోనే అపురూప ఘట్టంగా మిగిలిపోతాయన్నారు. కలెక్టర్ వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జా దీపిక యుగందర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జెడ్పీ వైస్‌చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, మున్సిపల్‌వైస్ చైర్మన్‌పుట్ట కిషోర్ పాల్గొన్నారు.



అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి

అమరుల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రం అభివృద్ధి

- మంత్రి జగదీష్‌రెడ్డి
- జెడ్పీ కార్యాలయంలో అమరులకు నివాళి



జెడ్పీ కార్యాలయంలో మౌనం పాటిస్తున్న మంత్రి , జెడ్పీ చైర్ పర్సన్ , కలెక్టర్, జెడ్పీసీఈఓ

సూర్యాపేటటౌన్ : తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జెడ్పీ కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో జెడ్పీ చైర్ పర్సన్ గుజ్జా దీపిక.. అమరుల సంస్మరణ తీర్మానం ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. కార్యక్రమానికి మంత్రి హాజరై మాట్లాడారు. రాష్ట్రం సాధిస్తున్న ఉజ్వల ప్రగతిలో వారి త్యాగం ప్రతిఫలిస్తుందన్నారు. అనంతరం తెలంగాణ అమరులకు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకట్రావు, ఎంపీ లింగయ్యయాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటనారాయణగౌడ్, సీఈఓ సురేష్ పాల్గొన్నారు.

అధిక ఫీజులకు నిరసనగా ధర్నా

సూర్యాపేటటౌన్ : నిబంధనలకు విరుద్ధంగా అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డీఈఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగరాజు, సైదులుమాదిగ, లింగయ్యయాదవ్, అశోక్, సంపత్‌నాయుడు, కర్ణాకర్, మహేష్, వికాస్, అశోక్ పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రభుత్వ ధనంతో సొంత పార్టీ ప్రచారం

- మాజీ ఎమ్మెల్యే పద్మావతి

కోదాడరూరల్ : దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రభుత్వ ధనం ఖర్చు చేసి సీఎం కేసీఆర్ సొంత పార్టీ ప్రచారం చేసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి ఆరోపించారు. పీసీసీ పిలుపు మేరకు దశాబ్ది దగా పేరుతో గురువారం కోదాడ పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణను సీఎం కేసీఆర్ అధోగతిపాలు చేశారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తమ కుటుంబ ఆస్తులు పెంచుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను తుంగలో తొక్కి మాయమాటలతో మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారని పేర్కొన్నారు. కేజీ టూ పీజీ ఉచిత విద్య, నిరుద్యోగభృతి, ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడెకరాల భూమి, రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ వంటి హామీలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆహామీలను నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని ఆమె కోరారు. అనతంరం కోదాడ పట్టణంలోని రాజీవ్ చౌక్‌లో సీఎం దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీ ఓకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, పార సీతయ్య, తూమాటి వరప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, డేగ శ్రీధర్, బగ్దాద్ తదితరులు ఉన్నారు.



కోదాడ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి, కాంగ్రెస్ నాయకులు

రైతు వేదికల నిర్వహణకు నిధులేవీ?

- కేటాయించాల్సినవి ప్రతి నెలా రూ.9వేలు
- తొమ్మిదినెలలుగా విడుదల చేయని ప్రభుత్వం
- ఏఈఓలకు తప్పని ఇబ్బందులు
- జిల్లాలో 82 రైతు వేదికలు



తొండ క్లస్టర్‌లోని రైతు వేదిక భవనం

తిరుమలగిరి (తుంగతుర్తి): రైతు వేదికల నిర్వహణకు నిధులు రావడంలేదు. తొమ్మిది నెలలుగా డబ్బులు రాక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కనీసం కరెంటు చార్జీలు కూడా చెల్లించే పరిస్థితి లేదు. రైతులు నిరంతరం సమావేశాలు నిర్వహించుకొని పంటల సాగులో కొత్త విధానాలతో పాటు అధికారుల సూచనలు, సలహాలు తెలుసుకునేందుకు వీలుగా జిల్లాలో రైతు వేదికలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయ క్లస్టర్ల వారీగా 82 రైతు వేదికలను నిర్మించింది. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ విభాగాలు, ఇతర శాఖలకు సంబంధించి అవసరమైన సమావేశాలు అప్పుడప్పుడు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ అధికారులతో పాటు రైతు సమితి అధ్యక్షుడి భాగస్వామ్యంతో కార్యక్రమాలు చేపడుతున్నారు. రైతు వేదికలను కొన్ని గ్రామాలకు దగ్గరగా ఉన్నా మరికొన్నింటిని దూరంగా నిర్మించారు. కార్యాలయాలను ఏర్పాటు చేశారు గానీ వాటి నిర్వహణకు నిధులు కేటాయించడం లేదు.

ప్రతి నెలా కేటాయించాల్సిన నిర్వహణ నిధులు(రూ.లలో)

పరిశుభ్రత, కాపలాదారు	3,000
శిక్షణ కార్యక్రమాలకు	2,500
స్టేషనరీ, జిరాక్స్	1,000
విద్యుత్ చార్జీలు	1,000
మరమ్మతులు	1,000
తాగు నీరు	1,000

ఏఈఓలకు కష్టాలు

రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం తగిన నిధులు విడుదల చేయక పోవడంతో ఏఈఓలు ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరం జూన్ వరకు ప్రతి నెలా రూ.9 వేల చొప్పున నిధులు కేటాయించింది. గత సెప్టెంబర్ నుంచి డబ్బులు రావడం లేదు. దీనికి తోడు విద్యుత్ చార్జీలు చెల్లించక పోవడం.. సదరు అధికారులు కూడా ఒత్తిడి చేస్తుండటంతో జిల్లా స్థాయి అధికారులు పరిస్థితిని విద్యుత్ ఉన్నతాధికారులకు వివరించి చెల్లింపులకు సమయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రభుత్వం వానా కాలం పంటను దృష్టిలో పెట్టుకొని నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉంది.

ప్రతి నెలా నిధులు విడుదల చేయాలి

రైతు వేదికల నిర్వహణకు ప్రతి నెలా నిధులు విడుదలైతే అవసరానికి ఉపయోగ పడతాయి. కొద్ది రోజులుగా నిధులు రాకపోవడంతో నిర్వహణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

–వెంకట్‌రెడ్డి, ఏఈఓ, తిరుమలగిరి.

శిక్షణ కార్యక్రమాలు, సమావేశాలు..

వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అందుబాటులో ఉండే విధంగా రైతు వేదికలో వసతి కల్పించారు. ప్రత్యేకంగా ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. శిక్షణ కార్యక్రమాలకు అవసరమైన కుర్చీలు, మైక్ వంటివి కూడా అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ నిధులతో పాటు రైతుల తోడ్పాటుతో కూడా కొన్ని చోట్ల అవసరమైన వసతులు సమకూర్చారు. వీటిలో సీజన్ల వారీగా పంటల సాగుపై అవసరమైన వారికి సలహాలు, సూచనలు ఇస్తుంటారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వీటిలో వ్యవసాయశాఖ రైతు సమావేశాలు నిర్వహించింది. వీటిని ఇతర శాఖలు కూడా వినియోగించుకుంటున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే గ్రామాల్లో మినీ వేడుక మందిరంగా రైతు వేదిక ఉపయోగ పడుతోంది.

క్లుప్తంగా

మహిళ అదృశ్యం


మౌనిక

మిర్యాలగూడ అర్బన్: కుటుంబ సభ్యులతో కలిసి పని నిమిత్తం మిర్యాలగూడ పట్టణానికి వచ్చిన మహిళ అదృశ్యమైనట్లు గురువారం ఫిర్యాదు అందిందని మిర్యాలగూడ టూటౌన్ ఎస్ఐ ఎస్. క్రిష్ణయ్య పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండలం చింతకుంట్ల గ్రామపంచాయతీ పరిధిలోని కొర్రతండాకు చెందిన కేతావత్ మౌనిక బుధవారం పని నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి మిర్యాలగూడ పట్టణానికి వచ్చింది. మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో మిర్యాలగూడ రైతు బజారు వద్ద తన బాబాయికి ఆధార్‌కార్డు ఇచ్చి వస్తానని చెప్పి వెళ్లిన మౌనిక తిరిగి రాలేదు. ఆమె ఎంతకూ రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం మిర్యాలగూడ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. మౌనిక ఆచూకీ తెలిసిన వారు 8186865497 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో కవలలు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ధర్నా


మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఎదుట ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

నల్లగొండ టౌన్: నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో గురువారం నవజాత కవలలు మృతిచెందారు. కాగా వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువులు మృతిచెందారని ఆరోపిస్తూ బంధువులు మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం కురుమర్తి గ్రామానికి చెందిన సతీష్ తన భార్య నవ్యను ఈ నెల 20న కాన్పు కోసం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాడు. నవ్యను పరీక్షించిన వైద్యులు అంతా బాగానే ఉందని నార్మల్ డెలివరీ అవుతుందని చెప్పారు. కాగా గురువారం నవ్యకు పురిటినొప్పులు రావడంతో డాక్టర్లు ఆపరేషన్ చేసి కవలలను బయటకు తీయగా అప్పటికే వారు మృతిచెందారు. కాగా వైద్యులు సకాలంలో ఆపరేషన్ చేసి ఉంటే తమ పిల్లలు బతికేవారని సతీష్ ఆవేదన వ్యక్తం చేశాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ పిల్లలను చనిపోయారని, డాక్టర్లపై వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ లచ్చు మాట్లాడుతూ.. తల్లి గర్భంలో ఉండగానే కవలలు చనిపోయి ఉన్నారని, దీంతో వెంటనే ఆపరేషన్ చేసి బయటకు తీయాల్సి వచ్చిందన్నారు. ఇందులో వైద్యుల నిర్లక్ష్యమేమీ లేదని పేర్కొన్నారు.

చనిపోయిన వ్యక్తికి వైద్యం చేశారని..

- ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

నల్లగొండ టౌన్: చనిపోయిన వ్యక్తికి వైద్యం చేసి డబ్బులు వసూలు చేశారని ఆరోపిస్తూ గురువారం నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రం సమీప గ్రామానికి చెందిన నరేష్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో కుటుంబ సభ్యులు బుధవారం నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ వైద్యులు పరీక్షించి హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. కానీ కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు వెళ్లకుండా రాత్రి సమయంలో నల్లగొండ పట్టణంలోని ఐకాన్ ప్రైవేట్ ఆస్పత్రికి నరేష్‌ను తీసుకెళ్లగా గురువారం మృతిచెందాడు. అయితే నరేష్ చనిపోయినప్పటికీ చెప్పకుండా ఆస్పత్రిలో చేర్చుకుని వైద్యం చేసినట్లు చేసి డబ్బులు వసూలు చేశారని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. ఐకాన్ ఆస్పత్రి డాక్టర్లపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. దీనిపై ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ శశాంక్ మాట్లాడుతూ.. తల, ఛాతిపై తీవ్రగాయాలతో ఉన్న నరేష్‌ను బుధవారం రాత్రి ఆస్పత్రికి తీసుకొచ్చారని, అతడిని పరీక్షించి 99శాతం బతికే అవకాశం లేదని లేదని చెప్పినప్పటికి వైద్యం చేయాలని కుటుంబ సభ్యులు కోరారన్నారు. గురువారం మళ్లీ నరేష్ బంధువులను పిలిచి నమ్మకం లేదని చెప్పామని, దీంతో వారు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లే లోపే అతడు చనిపోయాడని తెలిపారు. చనిపోయిన వ్యక్తికి ట్రీట్‌మెంట్ చేశామనడంలో వాస్తవం లేదన్నారు. ఆస్పత్రిలో వారు రూపాయి కూడా చెల్లించలేదని, మందులు మాత్రం కొన్నారని పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో దొంగతనం

- 30తులాల బంగారు ఆభరణాలు, 14తులాల వెండి చోరీ


బీరువాను పరిశీలిస్తున్న ఏసీపీ కోట్ల నర్సింహారెడ్డి, సీఐ సైదయ్య

యాదగిరిగుట్ట: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి బంగారు ఆభరణాలు, వెండి అపహరించిన ఘటన యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితులు, సీఐ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంనగర్ కాలనీలో నివాసముంటున్న చెరుకుపల్లి కొండల్ రెండు రోజుల క్రితం తన కుమార్తె డెలివరీ కోసమని ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. గురువారం ఉదయం తిరిగి కొండల్, అతడి కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండటం గమనించి వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని దుస్తులు చిందరవందరగా పడేసి ఉండటంతో పాటు అందులో ఉన్న సుమారు 30తులాల బంగారు ఆభరణాలు, 14 తులాల వెండిని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించాడు. విషయం తెలుసుకున్న ఏసీపీ కోట్ల నర్సింహారెడ్డి, సీఐ సైదయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంని రప్పించి వేలిముద్రలు సేకరించారు. బాధితుడు కొండల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు అపహరణ

చౌటుప్పల్: నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడును గుర్తుతెలియని దొంగ లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామానికి చెందిన కట్ట రాములమ్మ(60), ఆమె బంధువు వెంకటమ్మ కలిసి చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లసింగారం గ్రామంలో తమ బంధువు అంత్యక్రియలకు వెళ్లేందుకు వస్తూ స్థానిక బస్‌స్టేషన్‌లో బస్సు దిగారు. తాళ్లసింగారం గ్రామానికి నేరుగా ఎలాంటి వాహనాలు అందుబాటులో ఉండనందున చౌటుప్పల్ పట్టణంలోని భాస్కర్ థియేటర్ నుంచి రాంనగర్‌కాలనీ మీదుగా ఇద్దరు కలిసి నడుచుకుంటూ వెళ్తున్నారు. అప్పటికే నల్లరంగు టీషర్ట్ ధరించిన యువకుడు వీరిని అనుసరిస్తున్నాడు. ఈ విషయాన్ని వారు గుర్తించలేదు. కాగా స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సమీపంలోకి వెళ్లగానే రాములమ్మ మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెలతాడును యువకుడు లాక్కొని పారిపోయాడు. రాములమ్మ కేకలు వేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పోలీసులకు సమాచారం అందించడంతో దొంగ కోసం పరిసర ప్రాంతాల్లో తీవ్రంగా గాలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దేవేందర్ తెలిపారు.

బైక్‌ని ఢీకొట్టిన లారీ.. భర్త మృతి

- భార్య, కుమారుడికి గాయాలు


అశోక్ (ఫైల్)

హాలియా: తమ కుమారుడితో కలిసి వెళ్తున్న బైక్‌పై భార్యాభర్తలను ఎదురుగా లారీ వచ్చి ఢీకొట్టడంతో ఘటనలో భర్త అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఈశ్వర్ నగర్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన అటికం అశోక్(22) చేపల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య ధనలక్ష్మి, ఏడాది వయస్సున్న కుమారుడు ఉన్నారు. ధనలక్ష్మి గర్భవతి కావడంతో ఆస్పత్రిలో చూపించడానికి ముగ్గురూ కలిసి గురువారం బైక్‌పై నల్లగొండకు బయల్దేరారు. ఆస్పత్రిలో చూపించుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఈశ్వర్‌నగర్ సమీపంలోకి రాగానే వీరి బైక్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్ అక్కడికక్కడే మృతిచెందగా, ధనలక్ష్మికి తీవ్ర గాయాలు, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహన సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు చికిత్స నిమిత్తం ధనలక్ష్మి, కుమారుడిని నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని లారీని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడు. అశోక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

పురుగుమందు తాగి యువతి ఆత్మహత్యాయత్నం

పెద్దవూర: నిత్యం ఇంట్లో జరుగుతున్న ఆస్తి తగాదాలతో మనస్తాపానికి గురైన యువతి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం పెద్దవూర మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. పెద్దవూర మండలంలోని పాత జయరాంతండాకు చెందిన కేతావత్ పాండుకు ఇద్దరు భార్యలు. పెద్ద భార్య కీరికి ఇద్దరు కుమార్తెలు. వీరిద్దరికి వివాహమయ్యింది. 22 ఏళ్ల క్రితం పాండు రెండో వివాహం చేసుకున్నాడు. చిన్న భార్య రాజీకి ఒక కుమార్తె సంధ్య(18), ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద భార్య కీరికి పాండు రెండెకరాల వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేయించాడు. దీంతో గత రెండేళ్లుగా ఇద్దరి భార్యల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పాండు సైతం పెద్ద భార్య వద్దనే ఉంటూ చిన్న భార్యకు దూరంగా ఉంటున్నాడు. దీనిపై చాలాసార్లు పెద్దమనుషుల మధ్య పంచాయితీ పెట్టించారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో చిన్న భార్య రాజీ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టింది. రాజీ కుమార్తె సంధ్య ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఇంట్లోనే ఉంటుంది. నిత్యం ఇంట్లో ఆస్తి తగాదాలు జరుగుతుండటం, తండ్రి తమను పట్టించుకోకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై సంధ్య గురువారం తమ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చుట్టుపక్కల పొలాల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు 108 వాహనంలో నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌ను సంప్రదించగా ఇప్పటివరకు తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

ఎంజీయూలో అమరులకు నివాళి


తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహాత్మా గాంధీ యూనివర్సిటీలో గురువారం అమరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి, అధ్యాపకులు రవి, ప్రశాంతి, మద్దిలేటి, ప్రేమ్‌సాగర్, రేఖ, ఉపేందర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్, కిరణ్, భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు. - నల్లగొండ రూరల్

చెన్నకేశవస్వామి ఆలయంలో చోరీ

- ఉత్సవ విగ్రహాల మెడలోని బంగారు పుస్తెలతాడు అపహరణ


గర్భగుడి గడపపై పడి ఉన్న తాళం

భూదాన్‌పోచంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో గల చెన్నకేశవస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి అమ్మవారి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లారు. ఆలయ పూజారి నర్సింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం గ్రామానికి చెందిన కారింగు బాలయ్య ఆలయాన్ని శుభ్రం చేసేందుకు వెళ్లగా దేవాలయం ఉత్తర వైపు ఉన్న గేట్ తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి లోనికి వెళ్లి చూడగా గర్భగుడి తలుపు బేడం విరిగి, తాళం కిందపడి ఉంది. దీంతో వెంటనే అతడు ఆలయ పూజారి నర్సింహమూర్తికి విషయం తెలియజేశాడు. పూజారి ఆలయానికి చేరుకొని గర్భగుడి లోనికి వెళ్లి చూడగా శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాల మెడలో ఉన్న సుమారు 7గ్రాముల బంగారు పుస్తెలతాడు చోరీకి గురైందని గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు. అయితే మూలవిరాట్ దేవుళ్ల మెడలో ఉన్న మరో రెండు తులాల పుస్తెలతాడు పూలమాలలు, శాలువా మాటున ఉండటంతో దుండగులు దానిని గమనించకపోవడంతో చోరీకి గురికాలేదని పూజారి పేర్కొన్నారు. కాగా నాలుగు నెలల క్రితం గుర్తుతెలియని దుండగులు ఇదే దేవాలయంలో హుండీలోని నగదును ఎత్తుకెళ్లారని తెలిసింది.

కుర్మేడ్ దేవాలయంలో..

చింతపల్లి: మండల పరిధిలోని కుర్మేడు గ్రామంలో గల శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దేవాలయంలోని హుండీ తాళాలు పగులగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండల పరిధిలోని జైకేసారం గ్రామపంచాయతీకి చెందిన ఆకారం ప్రశాంత్(21) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం రాత్రి చౌటుప్పల్ పట్టణం నుంచి తన స్వగ్రామానికి ఆటోలో వెళ్తున్నాడు. మార్గమధ్యలో చౌటుప్పల్ పట్టణంలోని బాలాజీ రామకృష్ణ దేవాలయం వద్దకు రాగానే ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న శ్రీకాంత్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దేవేందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నల్లగొండ క్రైం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు. వన్ టౌన సీఐ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని కట్టవారిగూడెం గ్రామానికి చెందిన బొబ్బిలి నరేష్(27) ఈ నెల 20న బైక్‌పై కనగల్ మండలంలోని దర్వేశిపురంలో శుభకార్యానికి హాజరయ్యాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా నల్లగొండ పట్టణం దేవరకొండ రోడ్డులోని రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ పైనుంచి అదుపుతప్పి కిందపడడంతో నరేష్ తలకు తీవ్రగాయాలయ్యాయి. వెనకే మరో బైక్‌పై వస్తున్న నరేష్ స్నేహితులు శివ, రాజు గమనించి వెంటనే అతడిని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు వీరస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సీఐ గోపి తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు గురువారం భువనగిరి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎస్. సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలో జగదేవ్‌పూర్ వెళ్లే రోడ్డు మార్గంలోని బ్రిడ్జి వద్ద కాజీపేట-సికింద్రాబాద్ రైలు మార్గంలో గురువారం తెల్ల వారుజామున గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్యలో ఉంటుందని,రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భువనగిరి పట్టణంలో దొంగల బీభత్సం

- మూడు షాపుల్లో చొరబడి సుమారు రూ.3లక్షల నగదు, సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌లు చోరీ


హార్డ్‌డిస్క్‌ను ఎత్తుకెళ్లడంతో ఖాళీగా ఉన్న బాక్స్

భువనగిరి: పట్టణంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. పలు షాపుల తాళాలు పగులగొట్టి నగదు, సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌లు అపహరించారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి భువనగిరి పట్టణంలోని హైదరాబాద్-వరంగల్ ప్రధాన రహదారి పక్కన గల ప్రిన్స్ మెడికల్ ఏజెన్సీ, ప్రిన్స్ మెడికల్ షాప్, గ్రీన్ బకెట్ బిర్యాని సెంటర్ షట్టర్లకు వేసిన తాళాలను తొలగించి గుర్తుతెలియని వ్యక్తులు లోనికి ప్రవేశించారు. ప్రిన్స్ మెడికల్ ఏజెన్సీలో రూ.1.20లక్షలు, ప్రిన్స్ మెడికల్ హాల్‌లో రూ.1.50లక్షలు, గ్రీన్ బకెట్ బిర్యాని సెంటర్‌లో రూ.30వేల నగదు చోరీ చేశారు. అంతేకాకుండా దొంగలను గుర్తించకుండా మూడు షాపుల్లో ఉన్న సీసీ కెమెరాల వైర్లను కట్ చేసి హార్డ్‌డిస్క్‌లను ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఆయా షాపుల యాజమానులు వచ్చి చేసేసరికి షట్టర్లు యాథావిధిగా ఉన్నప్పటికీ తాళాలు తీసి ఉండడంతో లోనికి వెళ్లి చూడగా వస్తువులు అన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. నగదు, హార్డ్‌డిస్క్‌లు చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే పోలీసులు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శాస్త్రోక్తంగా నృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వేదమంత్రాలతో విశేషంగా నిర్వహించారు. కృష్ణానది నుంచి మంగళవాయిద్యాలతో బిందె తీర్థం తీసుకొచ్చి గర్భాలయంలోని మూల విరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర కుంకుమార్చనలు చేపట్టారు. అదే విధంగా ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో స్వామివార్లను నూతన పట్టువస్త్రాలంకరణతో వధూవరులుగా అలంకరించారు. నిత్య కల్యాణాన్ని ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదంతో ప్రారంభించి విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాల మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగంతోనే తెలంగాణ సాధన


దోసపహాడ్‌లో కొండేటి వేణుగోపాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య

పెన్‌పహాడ్: అమరవీరుల త్యాగంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్‌లో తెలంగాణ అమరుడు కొండేటి వేణుగోపాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేణుగోపాల్‌రెడ్డి తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేసుకోవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఎంపీ లింగయ్య యాదవ్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సభ్యుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి, ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దొంగరి యుగేంధర్, పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, సర్పంచ్ దొంగరి సుధాకర్, మామిడి అంజయ్య, ఉప సర్పంచ్ రాంబాబు, గుడిపూరి వెంకటేశ్వర్లు, మేకల శ్రీనివాస్, జగన్, పొదిల నాగార్జున, దంతాల వెంకన్న, మధు, సర్పంచ్‌లు బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చెన్ను శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్రిక్తంగా మారిన కాంగ్రెస్ పార్టీ నిరసన

- చౌటుప్పల్‌లో హైవేపై రాస్తారోకో చేసేందుకు నాయకుల యత్నం
- అడ్డుకున్న పోలీసులు


రాస్తారోకో చేసేందుకు వస్తున్న పాల్వాయి స్రవంతి, పున్న కైలాష్, నాయకులు


పాల్వాయి స్రవంతి, పున్న కైలాష్, నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

చౌటుప్పల్: టీపీసీసీ పిలుపు మేరకు గురువారం చౌటుప్పల్ పట్టణంలో చేపట్టిన 'దశాబ్ది దగా-తెలంగాణ రావణ వధ' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. పోలీసులకు, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మధ్య తోపులాటకు దారి తీసింది. పట్టణంలోని బస్టాండ్ ముందు జాతీయ రహదారిపై రాస్తారోకో చేసేందుకు పీసీసీ అధికార ప్రతినిధి పాల్వాయి స్రవంతి, పీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్ పార్టీ శ్రేణులతో కలిసి స్థానిక రాజీవ్‌స్మారక భవనం నుంచి బయల్దేరారు. రహదారిపై బైఠాయించే క్రమంలో అప్పటికే పెద్దఎత్తున మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పార్టీ శ్రేణులు, పోలీసుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. అనంతరం పాల్వాయి స్రవంతి, పున్న కైలాష్ పార్టీ శ్రేణులతో కలిసి ఆర్డీఓకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా అందుకు సైతం పోలీసులు అంగీకరించలేదు. ఈ క్రమంలో మరోసారి కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసులను ప్రతిఘటించారు. దీంతో పోలీసులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని చౌటుప్పల్‌తో పాటు రామన్నపేట, పోచంపల్లి, వలిగొండ, నారాయణపురం పోలీస్ స్టేషన్‌లకు తరలించారు.

అరాచక పాలనకు అంతం తప్పదు..

పోలీసుల అండతో రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి త్వరలో అంతం తప్పదని పాల్వాయి స్రవంతి, పున్న కైలాష్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దశాబ్ది వేడుకలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కును బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాలరాస్తోందని ధ్వజమెత్తారు. ఆరు నెలల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రవీందర్, నల్ల నరేందర్‌రెడ్డి, షేక్ జానీబాబు, లందగిరి భీమయ్య, మల్కాపురం నర్సింహ, చెరుకు లింగస్వామి, జగన్‌రెడ్డి, అశోక్, సైదులు, ఆవుల ఏసుదాసు, రఫీక్, గోవర్ధన్‌రెడ్డి, పార శ్యాం, గౌస్‌ఖాన్, కె. లింగస్వామి, తదితరులు ఉన్నారు.